విశాలాంధ్ర



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా

గురువారం 23 జనవరి, 2025. 4 పేజీలు

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక నాయకులను సమన్వయం చేసుకొని గ్రామాలను పరిశుభ్రంగా వుంచేదుకు వుంచేందుకు కృషి చేయా లన్నారు. కోవూరు నియోజకవర్గంలోని అధికారులను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆదేశించారు. డ్రైనేజి కాలువలలో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. నిర్దేశిత ప్రదేశాలలో మాత్రమే చెత్త వేసి పారిశుధ్య కార్మికులతో సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వీధుల్లో చెత్తా చెదారాలు పేరకు పోకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్య నిర్లక్ష్యం కారణంగా ప్రబలే అంటు వ్యాధుల గురించి ప్రజలకు వివరించాలని అధికారులకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సూచించారు. నిరంతర ఫాగింగ్ ద్వారా దోమల వ్యాప్తిని నియంత్రించాలని కోరారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చొరవతో అప్రమత్తమైన పంచాయతి అధికారులు కోవూరు గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు.

మాజీ మంత్రి కాకాణిపై

కావలి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: మాజీ మంత్రి గోవర్ధన్ రెడ్డి పై కావలి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో 2024,351/2,352,353/2 సెక్షన్ ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు, టిడిపి వర్గీలు దాడి చేయడంతో గాయపడిన వైఎస్ఆర్సిపి కార్యకర్తను పరామర్శించేందుకు కావలి ప్రభుత్వాసుపత్రికి వెళ్ళిన కాకాని గోవర్ధన్ రెడ్డి కావలి ప్రభుత్వ ఆసుపత్రిలో పోలీసులపై తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు, మీడియాతో మాట్లాడుతూ పోలీసులు అధికారులు సప్తసముద్రాల అవతల ఉన్న బట్టలు ఊడదీస్తామని ఘాటైన వ్యాఖ్యలు చేసిన కాకాణి,వైసిపి పై దాడిచేసిన టీడీపీ వారిని వదిలేది లేదంటూ కాకాణి బహిరంగంగా బెదిరించారంటూ కాకాణిపై కొల్లదిన్నెకు చెందిన ఒంటేరు ప్రసన్న ఫిర్యాదు చేయడంతో కావలి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో కాకానిపై కేసు నమోదు అయింది.

సాయుధ బలగాల వార్షిక

సమీకరణను ప్రారంభించిన ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు : పోలీసు కవాతు మైదానమనందు ప్రతి సంవత్సరం జరిగే జిల్లా సాయుధ బలగాల సిబ్బంది వార్షిక సమీకరణ రీఫ్రెష్ ట్రైనింగ్ను ప్రారంభించిన యస్పి కృష్ణకాత్. శాంతి భద్రతలు పరిరక్షించడంలో జిల్లా సాయుధ దళ పోలీసుల సేవలు పోలీసుశాఖకు ఎంతో కీలకం అన్నారు. వృత్తిరీత్యా పోలీస్ శాఖలో చోటు చేసుకుంటున్న నూతన మార్పులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యం పెంపొందించుకుని మెరుగైన సేవలందించాలన్నారు. పోలీసులు చేసే ప్రతీ పనిలోనూ ఎంతో నేర్పరితనం, సమయ స్ఫూర్తి, నైపుణ్యంతో కూడుకుని ఉంటాయి. సిబ్బంది యొక్క సర్వీస్, ఇతర సమస్యలు ఉంటే తెలపాలని, సాధ్యాసాధ్యాలు పరిశీలించి తగిన పరిష్కారం చూపుతానని భరోసానిచ్చారు. సాయుధదళ పోలీసులు శారీరకంగా ,మానసికంగా దృఢంగా ఉండాలని, మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామాలు అలవరచుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. క్రమశిక్షణతో మెలగాలి.ప్రస్తుత పరిస్థితులు, అవసరాల దృష్ట్యా ఈ మొబిలైజేషనులో సాయుధదళ పోలీసులకు ఒత్తిడిని జయించేందుకు యోగా, వ్యక్తిత్వ వికాసాన్ని, సైబర్ నేరాలపై అవగాహన, ఆర్థిక స్థితులను మెరుగుపర్చేందుకు మొబలైజేషన్ ఎంతో ఉపయోగకరం అన్నారు. ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న తర్ఫీదు అంశాలను మరోసారి గుర్తు చేసుకుంటూ మరింత సమర్థవంతంగా తీర్చి దిద్దుకునేందుకు ఈ మొబలైజేషన్ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు.అత్యాధునిక ఆయుధాల నిర్వహణ ఉపయోగంతో పాటు ఫైరింగ్, డ్రిల్, మార్చ్ ఫాస్ట్, మాబ్ కంట్రోల్,వివిఐపిఎస్కార్ట్స్, పిఎస్ఓ, బందోబస్తుదలగు అన్ని అంశాల గురించి పూర్తి అవగాహన పొందండన్నారు. ఉద్యోగ విరామంలో దొరికే సమయాన్ని కుటుంబంతో గడుపుతూ,పిల్లల క్రమశిక్షణ,వారి విద్యాభ్యాసం, పురోగతి తదితర అంశాలపై దృష్టిసారించాలన్నారు. స్ఫూర్తిదాయక సందేశాన్ని ఇచ్చి ఉత్సాహపరిచినందుకు యస్పికి ధన్యవాదాలుతెలిపి, వార్షిక సమీకరణలో పొందుబరిచిన అంశాలను, మెళుకువలను నేర్పిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సౌజన్య ,టౌన్ డియస్పి సింధుప్రియ, రూరల్ డియస్పి గట్టమనేని శ్రీనివాసరావు, డియస్పి,ఏఆర్ చంద్రమోహన్, ఆర్ఐ అడ్మిన్ హరిబాబు,ఆర్ఐ వెల్ఫేర్రాజారావు ,ఆర్ఐఎంటి అంకమరావు, ఆర్ఐహోమ్ గార్డ్ పౌల్రాజు, సిఐలు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి,ఎఆర్ సిబ్బంది పాల్గొ న్నారు.

గిరిజనుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తాం:సోమిరెడ్డి

రైతుల దేగపూడి బండేపల్లి కాలువ సాకారం చేసే బాధ్యత నాదే: ఎమ్మెల్యే

విశాలాంధ్ర -మనుబోలు: గిరిజనుల అభివృద్ధి సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు.గత ఐదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రంలో జగన్ విధ్వంసం సృష్టించారని అదేవిధంగా సర్వేపల్లి లో కాకాని అరాచకం సృష్టించారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి విమర్శిం చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో సర్వేపల్లి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని సర్వేపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మనుబోలు మండల పరిధిలోని వడ్లపూడి గ్రామంలో 25 లక్షల రూపాయలతో నిర్మాణం చేపట్టిన సిమెంటు రోడ్లకు ప్రారంభోత్సవాలు చేశారు. వడ్లపూడి గ్రామానికి విచ్చేసిన సందర్భంగా గ్రామ సర్పంచ్ రమాదేవి, గ్రామ టిడిపి నాయకులు రఘురామనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. వడ్లపూడి గ్రామంలో గౌడ సంఘీయులచే నిర్మించిన అంకమ్మ దేవత వద్ద నిర్వహించిన పూజలలో పాల్గొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ వడ్లపూడి గ్రామంలో 67లక్షల రూపాయలతో సాగునీటి కాల్వ పనులు పూర్తి చేశామని మరో 70 లక్షల రూపాయలకు మెటల్ రోడ్లు ఏర్పాటుకు సంబంధించి నిధులు విడుదల చేస్తున్నట్టు తెలిపారు. వడ్లపూడి గ్రామస్తులు సచివాలయం కి వెళ్లాలంటే దూరంగా ఉన్న అక్కంపేట గ్రామానికి వెళ్ళవలసి వస్తుందని గ్రామస్తులకు అనుకూలంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. అత్యంత పేదరికంలో ఉన్న గిరిజన కుటుంబాల వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని నాయకులు అర్జీలు ఇచ్చారని వాటిని పరిశీలించి ప్రతి ఒక్కటి మంజూరు చేసి వడ్లపూడి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జనసేన నాయకులు సురేష్ నాయుడు మాట్లాడుతూ కాకాని కాకి లాగా అరుస్తున్నారని విమర్శించారు. ప్రజలు బుద్ధి చెప్పిన ఇంకా కాకానికి సిగ్గు రాలేదన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఆయన హయంలో పోలీస్ స్టేషన్లను ఆయన చేతిలోకి తీసుకొని విధ్వంసం సృష్టించారని విమర్శించారు. అనంతరం సర్పంచ్ రమాదేవి మాట్లాడుతూ వడ్లపూడి గ్రామం టిడిపికు కంచుకోట అని అన్నారు. వడ్లపూడి గ్రామాన్ని స్మార్ట్ విలేజ్‌గా చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అభివృద్ధి పనులకు సహకరించిన ఎమ్మెల్యేకు గ్రామం తరపున ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన చెర్లోపల్లి గ్రామంలో ఇటీవల మరణించిన తెలుగుదేశం పార్టీ నాయకులు కీర్తిశేషులు పాపన రమణయ్య ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి బొమ్మి సురేంద్ర యాదవ్, ఏఎంసి అధ్యక్షులు గాలి రామకృష్ణారెడ్డి, పి ఎ సి ఎస్ అధ్యక్షులు పొన్నూరు రామకృష్ణయ్య, కనుపూరు కాలువ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ వద్దినేని మస్తాన్ నాయుడు, తిరుపతి పార్లమెంటు కమిటీ యువత కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు రాయపాటి కిరణ్ కుమార్, మండల టిడిపి ఉపాధ్యక్షులు మధు నాయుడు, కృష్ణ నాయుడు, కలికి రమేష్ రెడ్డి, నంబూరు సుమన్ నాయుడు, టిడిపి నాయకులు పూండ్ల రామమోహన్ రెడ్డి, మానుగుంట సుధాకర్ రెడ్డి, ముంగర విజయ భాస్కర్ రెడ్డి, వెడిచర్ల వెంకటరమణారెడ్డి, వెందోటి భాస్కర్ రెడ్డి, కలికి వేణుగోపాల్ రెడ్డి, హనుమంత నాయుడు పొన్నూరు అశోక్ ,అధికారులు: ఎంపీడీవో జలజాక్షి, హౌసింగ్ ఏఈ భాస్కరరావు, విద్యుత్ఎఈ అనిల్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నాయక్, పి ఆర్ ఐఎఈ రాజశేఖర్, డిప్యూటీ తాహసిల్దార్ బషీర్, ఏ పి ఎం వనజాక్షి ,ఎపిఓ రాజమ్మ ,ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మమ్మ, వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులంతా ట్రేడ్ లైసెన్సులు పొందేలా

చర్యలు తీసుకోండి:అదనపు కమిషనర్



విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు :నగరపాలక సంస్థ పరిధిలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపారాలు చేసుకునే ప్రతి ఒక్కరికి ట్రేడ్ లైసెన్సులపై అవగాహన కల్పించి, తప్పనిసరిగా వారు పొందేలా చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ నందన్ శానిటేషన్ కార్యదర్శులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శానిటేషన్ విభాగంతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క వ్యాపారానికి ట్రేడ్ లైసెన్స్ అందించి వాటిని ఎం.ఎస్.ఎం.ఈ సర్వేలో పొందుపరచాలని సూచించారు. కమర్షియల్ ట్రేడ్ లైసెన్స్ లను గుర్తించి, నోటీసులను జారీ చేసి ఫిబ్రవరి లోపు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి నెల అనంతరం అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తుంది కావున ముందుగానే ట్రేడ్ లైసెన్సులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలనితెలియజేశారు. చెత్త తరలింపు వాహనాలకు సంబంధించిన సమస్యలు సంబంధిత వెహికల్ ఇంచార్జ్ డి.ఈ రఘురాం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని సూచించారు.దోమల నివారణ చర్యల్లో భాగంగా ప్రతిరోజు జరిపే ఫాగింగ్ సాయంత్రం లోపు ముగిసేలా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన

వ్యాపారులంతా ట్రేడ్ లైసెన్సులు పొందేలా ....

(మొదటి పేజి తరువాయి) అన్ని ప్రాంతాల్లో స్ప్రేయర్ల ద్వారా పిచికారి చేయడం, డ్రైను కాలువలలో ఆయిల్ బాల్స్ వేయడం, కాలువల్లో గంబూజియా చేప పిల్లలను వదలడం వంటి చర్యలను వేగవంతం చేయాలని అదనపు కమిషనర్ సూచించారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న అన్ని ఖాళీ స్థలాలను గుర్తించి వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. అదేవిధంగా ఖాళీ స్థలాలలో వ్యర్థాలు వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించాలని, హెచ్చరిక బోర్డులను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. సచివాలయ స్థాయిలో పరిష్కారం కానీ స్థానిక సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి తగిన పరిష్కారం పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క వార్డు శానిటేషన్ కార్యదర్శి తమ విధుల పట్ల పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శించకూడదని తెలియజేశారు. పెంపుడు కుక్కల యజమానులను కలిసి నగరపాలక సంస్థ లైసెన్సులు తప్పనిసరిగా తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. వివిధ విభాగాల వార్డు సచివాలయ కార్యదర్శులు అందరూ సమన్వయంతో విధులు నిర్వహించి స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని అదనపు కమిషనర్ సూచించారు. వార్డు సచివాలయ కార్యదర్శులు క్రమశిక్షణ పాటించి సమయపాలన విధుల పట్ల నిబద్ధత కలిగి ఉండాలని సూచించారు. సచివాలయ పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయిస్తే దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేసి జరిమానాలు విధించాలని సూచించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్ మోహన్,శానిటేషన్ విభాగం సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యావహారిక భాషోద్యమ వైతాళికుడు గిడుగు

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : వ్యావహారిక భాషా ఉద్యమ పితామహుడు గా ప్రసిద్ధి గాంచిన గొప్ప సాహితీవేత్త, సాహిత్య వ్యాసంగంలోనూ, నూతన విద్యా రంగంలోనూ, గ్రాంథిక భాషను వాడకుండా వ్యవహారిక భాషను వాడాలన్న మహోద్యమానికి ప్రాణం పోసిన వాడు గిడుగు రామమూర్తి పంతులు 85వ వర్ధంతి అన్నమయ్య సాహిత్య సేవా వేదిక, జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగినది. సభకు వక్తలు మాట్లాడుతూ వాడుక భాషోద్యమానికి సారథ్యం వహించి, వాడుక భాషలోనే ప్రజల వ్యవహారాలన్నీ జరగాలని లక్ష్యంగా చేసుకుని, దానికోసం గ్రాంథిక భాషావాదులతో తగవులు పడి చివరకు విజయాన్ని సాధించిన వైతాళికుడు గిడుగు అని కొనియాడారు. సవర భాషను నేర్చుకుని లిపిని రూపొందించి సవర భాషలో చదువులు నేర్పిన గొప్ప గురువు గిడుగు రామ్మూర్తి పంతులు అని అన్నారు. ముందుగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణంలోని విజయ కాంప్లెక్స్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో అన్నమయ్య సంగీత సాహిత్య వేదిక అధ్యక్షులు స్నేహ మధురిమల రచయిత ఇనకొల్లు మస్తానయ్య, శ్రీ అన్నమయ్య సంగీత సాహిత్య వేదిక కార్యదర్శి నా మంచి మాట శతక కవి శేషగిరిరావు, జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు, పాలపిట్ట దీర్ఘ కావ్య రచయిత ముప్పవరపు కిషోర్, ప్రముఖ జానపద కళాకారులు, తెలుగు విశ్వవిద్యాలయ అవార్డు గ్రహీత కిన్నెర బ్రహ్మయ్య, షైన్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ రహీం, రిటైర్డ్ తెలుగు భాషా పండితులు జి.వెంకటస్వామి, కళాభిమాని షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ జన్మదిన వేడుకలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-ఉదయగిరి: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో గురువారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 43 వ జయంతి వేడుకలు ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు జరుగునున్నాయని మండల కన్వీనర్ చింతనబోయిన బయన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యని ర్వహణ కార్యదర్శి మాజీ జడ్పీ చైర్మన్ చంచల్ బాబు యాదవ్ ఈ కార్యక్ర మానికి హాజరవుతారని తెలిపారు లిఅనంతరం రక్తదాన శిబిరం జరుగుతుంది. ఎన్డీయే కూటమి నాయకులు, శ్రేణులు, అభిమానులు, మహిళ నాయకులు, ఐ.టి.డి.పి నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

క్లాస్ 3,క్లాస్ 4 ఉద్యోగాల్లో రిక్రూట్ మెంట్ చేయాలి

విశాలాంధ్ర - కావలి: జీవిత బీమా సంస్థలో క్లాస్ 3,క్లాస్ 4 ఉద్యోగాల్లో నియామకాలు చేయాలని ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గుర్తింపును కొనసాగించాలని ఐసిఈయూ సంయుక్త కార్యదర్శి జి. రవి కుమార్ డిమాండ్ చేశారు. సదరు సమస్యల పరిష్కారం కోరుతూ, కావలి ఎల్.ఐ.సి. కార్యాలయం ఎదుట బుధవారం భోజన విరామ సమయంలో సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, ఎల్ఐసి సిబ్బంది పాల్గొన్నారు.

మైనారిటీల ఆర్థికాభివృద్ధికి రాయితీ రుణాలు

షేక్. అబ్దుల్ అజీజ్, ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: రాష్ట్రంలోని మైనార్టీ వర్గాల ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా, కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకెళుతుందని ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. మైనార్టీలకు రాయితీ రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం తరపున రూ.152.50 కోట్లు, వెచ్చింపుకు జీవో విడుదల చేసిందని తెలిపారు. మరో 50% రూ.152.50 కోట్లు రుణ మొత్తాన్ని బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. నైపుణ్య శిక్షణ ఉపాధి కల్పనకు అదనంగా రూ. 21.07 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు అజీజ్ తెలిపారు. బ్యాంకు లింకేజీ ద్వారా రాయితీ రుణాలను 19,790 మందికి, నైపుణ్య శిక్షణ ఉపాధి కల్పన ద్వారా 29,428 మందికి మొత్తం లబ్ధిదారులు 49,218 మంది ఆర్థిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేయూతను ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు.

కేటగిరీల వారీగా రాయితీ రుణాల మంజూరు

మైనార్టీల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వార్షిక రాయితీ రుణ మంజూరు ప్రణాళికలో కేటగిరీల వారీగా రుణాలను మంజూరు చేయబోతున్నట్లు అబ్దుల్ అజీజ్ తెలిపారు. స్వయం ఉపాధి కింద 19790 మంది లబ్ధిదారులకు వారు ఏర్పాటు చేసుకునే యూనిట్ల వారిగా మూడు విభాగాలుగా గుర్తించి రుణాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో 15000 మంది లబ్ధిదారులకు రూ.లక్ష లోపు రుణం, 3040 మంది లబ్ధిదారులకు రూ. 1 లక్ష నుండి రూ. 3 లక్షల వరకు,1525 మంది లబ్ధిదారులకు రూ. 3 లక్షల నుండి రూ. 5 లక్షల వరకు,225 మంది లబ్ధిదారులకు రూ. 8 లక్షలు ప్రకారం రుణం అందించనున్నట్లు తెలిపారు. ప్రతి స్కీమ్ లో కనీసం 40% మహిళలకు చోటు కల్పిస్తారని అన్నారు. రూ. లక్ష లోపు రుణాలు మంజూరులో కిరాణా, పాన్, చికెన్, మటన్, పండ్లు, కూరగాయలు స్టాల్స్ ఏర్పాటు, ఎలక్ట్రికల్ రిపేరీ, సైకిల్ షాప్ లో తదితర యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు ఇస్తారని, రూ. 1 లక్ష నుండి రూ. 3 లక్షల లోపు ఏసి, ఫ్రిడ్జ్ రిపేరీ, ఆటోమొబైల్ స్పేర్ పార్ట్స్, బ్యాటరీ సర్వీసింగ్, సెల్ ఫోన్ రిపేరీ, మటన్,చికెన్ షాప్ లు, చెప్పుల షాపులు, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీ పార్లర్ తదితర యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు అందిస్తారని, రూ. 3 లక్షల నుండి రూ. 5 లక్షల వరకు ఆటోమొబైల్ సెక్టార్, ట్రాన్స్ పోర్టు సెక్టార్, ఫ్యాబ్రికేషన్ సెక్టార్ తదితర యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందిస్తారు. ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా ఎదగాలనుకునే వారికి మండల కేంద్రాలు, పురపాలక, నగరపాలక కేంద్రాలలో ఉన్నవారికి జనరిక్ మందుల దుకాణాలు, ఆటోమొబైల్ యూనిట్లు, ఫిట్ నెస్ సెంటర్లు తదితర యూనిట్లు ఏర్పాటు చేసుకున్నందుకు రూ. 8 లక్షలు రాయితీ రుణం మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మైనారిటీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి శిక్షణలో భాగంగా 25 వేల మందికి, మైనార్టీ మహిళలకు స్వయం ఉపాధి కింద టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితర వాటిల్లో 3,428 మందికి, మైనార్టీ ఎంపవర్మెంట్ కింద ఆటోమొబైల్ సెక్టార్, ఈవెంట్ మేనేజ్మెంట్, ఫిజియోథెరపీ తదితర వాటిల్లో వెయ్యి మంది మైనార్టీలకు,మొత్తం 29,428 మందికి శిక్షణ ఇవ్వబోతున్నట్లు అజీజ్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మైనార్టీల సంక్షేమానికి అప్పటి పాలకులు తూట్లు పొడిచారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 6 నెలల కాలంలోనే అన్ని రంగాలలో పూర్తిగా భ్రష్టు పట్టి పోయిన రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు చేస్తున్న కృషితో అప్పటి సమస్యల పరిష్కారం వేగవంతంగా కొలిక్కి వస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమం కోసం బడ్జెట్లో కేటాయింపులకు అనుగుణంగా వార్షిక ప్రణాళిక ప్రకారం నిధుల మంజూరు, తదుపరి అభివృద్ధి చర్యలు, ఆర్థిక చేయూతకు రాయితీ రుణాలు, మైనార్టీల ఆర్థిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టడం జరిగిందని అజీజ్ పేర్కొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర- ముతుకూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేస్తున్న బస్సు ఆరోగ్య శిబిరాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకో వాలని వల్లూరు పశు వైద్యులు రాజ్యలక్ష్మి కోరారు. బుధవారం పశు వైద్య శిబిరం మండలంలోని మల్లూరు పంచాయతీ కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా ఎదకు రాని పశువులకు అవి చూలు కట్టేందుకై అవసరమైన వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. అలాగే నటల నివారణ మందులను దూడలకు తాగించడం జరిగింది. ఇతర ఆరోగ్య సమస్యలతో ఉన్న పశువులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ముందుకు పంపిణీ చేయడం జరిగిందని ఆమె తెలిపారు.

ఉచిత పశు వైద్య శిబిరాలు

విశాలాంధ్ర- కందుకూరు రూరల్: కందుకూరు మండలం జిల్లలమూడి , శ్రీరంగరాజపురం గ్రామాలలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం జరిగినది కార్యక్రమంలో దూడలు, మరియు గేదలకు డివర్మింగ్ మందులు, గర్భకోస వ్యాధులు ఉన్న పశువులను, యదకురాని పశువులను పరీక్షించి వాటికి మందులు కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్స్, చూడి పరీక్షలు సాధారణ వ్యాధులకు మందులు, ఖనిజ లవణాల మిశ్రమమును పశు పోషకులకు ఉచితంగా ఇవ్వటం జరిగినది ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యులు డాక్టర్ యస్.సుధాకర్ పశు వైద్య సిబ్బంది ఎస్.కె .వెంకటేశ్వర్లు జే వి ఓజి. విజయ్ సాగర్, పశు వైద్య సహాయకులు వేణు, షాజహాన్ మరియు గ్రామ నాయకులు బోయపాటి.రమేష్, ఎస్.కె .మస్తాన్ రావేళ్ల వెంకటేశ్వర్లు, బెజవాడ శ్రీను కొత్తా. రాఘవరెడ్డి సర్పంచ్ సిహెచ్. సుజాత ఎంపీటీసీ పూనూరు వీరారెడ్డి, పశు పోషకులు పాల్గొన్నారు

ప్రభుత్వ డైట్,పల్లిపాడులో విజయవంతంగా

జిల్లా స్థాయి రంగోత్సవ్-2025

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఇందుకూరుపేట మండలం, పల్లిపాడులో గల ప్రభుత్వ డైట్ నందు ఉమ్మడి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాస్థాయి ఒక్క రోజు రంగోత్సవ్ కార్యక్రమం బుధవారం విజయవంతంగా ముగిసినట్లు డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు.ముందుగా ప్రార్థన,జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైందని,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డైట్ విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్ విచ్చేశారని ఆయన తెలిపారు.డైట్ ప్రధానాచార్యులు మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న వివిధ రకాల కళా నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యంగా ప్రతి సంవత్సరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖలు, యస్.సి.ఇ.ఆర్.టి,సమగ్ర శిక్ష, జిల్లా విద్యాశాఖ, ప్రభుత్వ డైట్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో - జిల్లా,రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో రంగోత్సవ్ కార్యక్రమం జరుగుతుందని జిల్లా స్థాయిలో ప్రభుత్వ డైట్ నందు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల నుండి 6 నుండి 12 తరగతులు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.నెల్లూరు జిల్లాలోని 8 పాఠశాలల నుండి 60 మంది విద్యార్థులు 8 విభాగాలలో పోటీపడ్డారని,ఒక్కో విభాగంలో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన వారికి పతకాలు మరియు సర్టిఫికెట్‌లు ప్రదానం చేసినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి రంగోత్సవ్ ఈ నెల 24వ తేదీన విజయవాడలో జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ ఉపన్యాసకులు డి.నర్సిం గరావు, యస్.బి.దాస్, కె.విజయచంద్ర, యన్.శివ,కె.షఫీ అహ్మద్, ఎస్మార్ట్ టీచర్లు,ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణ శివారు ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం

బుచ్చి మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు : రానున్న బడ్జెట్ లో బుచ్చిరెడ్డి పాలెం శివారు ప్రాంతాలలో మౌళిక సదుపాయాలకు ప్రాధాన్యత యిస్తామన్నారు మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి గారు. రోడ్లు, డ్రైనేజి సదుపాయాల కల్పించాలని బుచ్చి పట్టణ ఐదవ వార్డు పరిధిలోని బాలాజీ లేఔట్ వాసులు చైర్ పర్సన్ సుప్రజా మురళి కమీషనర్ చంద్రశేఖర్ రెడ్డి లదృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా చైర్పర్సన్సుప్రజామురళిమాట్లాడుతూ బుచ్చి పట్టణ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సహకారంతో శివారు ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని హామీ యిచ్చారు. కమీషనర్ తో కలిసి బాలాజీ లేఔట్ సందర్శించి అభివృద్ధిప్రణాళికరూపొందిస్తామన్నారు. అనంతరం బాలాజీ లేఔట్ వాసులైన అంకిరెడ్డి, వెంకటేశ్వర్లు, కోదండరామయ్య, శ్రీహరి, తదితరులు సమస్యలపై యిచ్చిన వినతిపత్రాన్ని అందుకున్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు : ఏఐసిసి,పిసిసి పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరుదేవ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జైబాపు -జై భీమ్- జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా వీఆర్సి సెంటర్లోనే అంబేద్కర్ విగ్రహం వద్దకు వివిధ డివిజన్ల నుంచి పాదయాత్రగా చేరుకొని నిరసన కార్యక్రమం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఉడత వెంకట్రావు యాదవ్ మాట్లాడుతూ పార్లమెంటులో అంబేద్కర్పై అమిత్ షా మాట్లాడిన తీరు సరిగా లేదని అంబేద్కర్ని అవమానించి మాట్లాడడాన్ని ఖండించారు. అమిత్షా మాటలకు నిరసనగా అమిత్ షా రాజీనామా చేయాలని నాయకులు కార్య కర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సురేష్ బాబు, తిరుపతయ్య, బాల సుధాకర్, ఫయాజ్, పొదలకూరు కళ్యాణ్, సోము అనిల్ కుమార్ రెడ్డి, గౌస్ బాషా, మోహన రెడ్డి, హుస్సేన్ భాష, అల్లాద్దీన్, మల్లికార్జున్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు : నెల్లూరు నగరంలో దోమలు విపరీతంగా ఉండడంతో ప్రజలు అల్లాడిపోతూ హాస్పిటల్స్ పాలు అవుతున్నారని అధికార పార్టీ నాయకులు గాని అధికారులు గానీ స్పందించకపోవడం శోచనీయం అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా నేత మల్లినిర్మల అన్నారు. పేద ప్రజల కోసం ఆరోగ్య కార్యక్రమాలు చేపట్టవలసి నటు వంటి కార్యక్రమాల్ని చేపట్టకుండా ప్రజలను గాలికి వదిలేసి అనారోగ్యం పాలు చేస్తున్న అధికార పార్టీ నాయకులను ఉపేక్షించేది లేదని ఆమె హెచ్చరించారు. ప్రజల పక్షాన అధికార పార్టీని నిలదీస్తామని అన్నారు. ప్రజలు జ్వరాలతో వైద్యశాలకి వెళితే సంబంధిత టెస్టులు రాస్తూ ఉండడంతో, పేద ప్రజలు అవి చేయించుకోవడానికి ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతు ఉన్నారని ఆమె అన్నారు.

రమణయ్యను పరామర్శించిన ఏపీ హంస జిల్లా అధ్యక్షులు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరులో హాస్పిటల్ అత్యవసర వైద్యం చేయించుకుంటున్న నాయుడుపేట తాలూకా ఎపి హంస ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.వి రమణయ్య ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని పరామర్శిస్తున్న ఏపీ హంస ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్ రావు, పెద్ద పరియ పిహెచ్చి నుండి విధులు ముగించుకుని వస్తున్న క్రమంలో నాయుడుపేట హైవేలో బైక్ యాక్సిడెంట్ జరిగి ఐసియులో ఉన్న రమణయ్యని డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ మాధవ, ఉద్యోగ సంఘ నాయకులు ప్రభాకర్ తదితరులు పరామర్శించారు.

పశు ఆరోగ్య శిబిరాలకు విశేష స్పందన

చెరుకుమూడిలో పశువులకు సమగ్ర ఆరోగ్య చికిత్సలు

విశాలాంధ్ర- మనుబోలు: రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ప్రతిష్టాత్మకంగా ముందస్తు ప్రణాళిక ప్రకారం రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తుందని ఈ శిబిరాలను రైతుల ఉపయోగించుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ షరీఫ్ అన్నారు. బుధవారం మండలంలోని చెరుకుముడి గ్రామంలో పశువైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. మనుబోలు మండలం చెరుకుముడి గ్రామంలో రైతుల నుండి మంచి స్పందన లభించిందన్నారు. ఈ శిబిరంలో మొత్తం 199 పశువులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు, చికిత్స అందించడం జరిగింది. గేదెలు, ఆవులలో చూడి పరీక్షలు, గర్భకోశ వ్యాధుల చికిత్స, సర్జరీ కేసులు పరీక్షించి, 47 దూడలకు, 74 పెద్ద పశువులకు నట్టల నివారణ మందులు (డీ వార్మింగ్)ఈ నెల 31 వరకు గ్రామాల వారీగా జరగనున్న ఈ పశు ఆరోగ్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దొడ్డవనేని బాబు రావు, బోలిగర్ల వెంకటేశ్వర్లు, కూరపాటి రమణయ్య, దొడ్డవనేని శంకరయ్య స్థానిక రైతులు, పశువైద్య సిబ్బంది కల్యాణి, ఇమామ్ భాషా, పవన్, మస్తానయ్య, శ్రీనివాసులుతదితరులు ఉన్నారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన కారు

కోదండరాం పురానికి చెందిన శంకరయ్య దంపతులకు గాయాలు

విశాలాంధ్ర -మనుబోలు: చెన్నై కలకత్తా 16 నంబరు జాతీయ రహదారిపై మనుబోలు క్రాస్ రోడ్డు వద్దబుధవారం ఉదయం830 సమయం లో బుల్లెట్ మోటార్ సైకిల్‌ను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మనుబోలు పంచాయతీ కోదండరాంపురం పింగాణి ఫ్యాక్టరీ యజమాని శంకరయ్య విజయలక్ష్మి దంపతులకు గాయాలయ్యాయి. మోటార్ సైకిల్ నడుపుతూ శంకరయ్య వెనక కూర్చున్న విజయలక్ష్మి కారు ఢీకొనడంతో వీళ్ళిద్దరికి గాయాలు తగిలాయి. నెల్లూరు వైపు నుండి చెన్నై వెళ్తున్న కారు వీళ్ళ మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టింది. ప్రతిరోజు శంకరయ్య తన బుల్లెట్ మోటార్ సైకిల్పై భార్య విజయలక్ష్మిని గూడూరు డిఆర్డబ్ల్యు వద్ద ఉన్న టైలర్ షాపుకు తీసుకువెళ్లి వదిలి వస్తారు. ఈ ప్రయత్నంలో ఇక్కడ జరిగిన ప్రమాదంలో విజయలక్ష్మి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. శంకరయ్య కుడికాలు పాదం గాయమై ఫ్యాక్చర్ అయింది. కారు నడుపుతున్న తమిళనాడుకు చెందిన వ్యక్తులు నెల్లూరు నుండి గూడూరు(చెన్నై)వెళ్తూ మోటార్ సైకిల్ ను గమనించకుండా ఢీకొట్టారు. అంబులెన్స్‌లో గాయపడ్డ శంకరయ్య విజయలక్ష్మిని గూడూరు విజయ మనోరమ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించండి: ఎంపిడిఓ

విశాలాంధ్ర- నెల్లూరు బ్యూరో: లింగసముద్రం మండలంలోని ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించాలని లింగ సముద్రం ఎంపిడిఓ కట్టా శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం నందు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కట్టా శ్రీనివాసులు ఆధ్వర్యంలోజాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల గురించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం నందు ప్రతిరోజు కూలీలకు పని కల్పించాలని,రాబోయే రోజులకు వర్కులు గుర్తించుటకు ఇంకుడు గుంటలు ఏర్పాటు చేయుటకు ఫారం ఫండ్స్. అమృత సరోవర్ సన్నకారు రైతులు గడ్డి పెంపకమునకు గురించి క్షేత్ర సహాయకులకు మరియు టెక్నికల్ అసిస్టెంట్లకు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశం నందు ఈసీ చిన కోటయ్య, టెక్నికల్ అసిస్టెంట్ లు, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తుంది కార్యక్రమం

విశాలాంధ్ర- గుడ్లూరు: మండలంలోని పరకొండపాడు మరియు బసిరెడ్డిపాలెం పూరేటిపల్లి రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి బి. రవికుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. వ్యవసాయ శాఖ మరియు అనుబంధ రంగాలు పొలం పిలుస్తోంది వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ కార్యక్రమం . పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పరకొండపాడు రైతులకు పొగాకులో ఆకు ముడత తెగులు నివారణ గురించి మాట్లాడుతూ ఇది వైరస్ తెగులు మరియు తెల్లదోమ దీనికి వాహకంగా పనిచేస్తుంది. దీని ఉధృతిని తెలిసికొనుటకు 8-10 పసుపురంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలి, నివారణకు 3 గ్రాముల తీమిత్తక్సమ్ మందును 3 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారిచెయ్యాలి లేదా 3 మిల్లీలీటర్ల ఇమిడాక్లోప్రిడ్ మందును 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారిచేసి నివారించుకోవచ్చును. తదుపరి పూరేటిపల్లిలో మాట్లాడుతూ వరి పంట ఇ -పంట చేయించుకొన్న రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించు కోవలసినదిగా మనవి. ఈ కార్యక్రమములో గ్రామ వ్యవసాయ సహాయకులు అనీల్, సాయిప్రకాష్, ఏఎంసి నుండి వెంకటేశ్వర్ రెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నిజాయితీకి నిదర్శనం జనసేన

విశాలాంధ్ర-ముత్తుకూరు: జనసేన అధినేత పవన్ కళ్యాణ్, జనసేన పార్టీ స్వచ్ఛతకు గుర్తు అని గుర్తించిన కేంద్ర ఎన్నికల కమిషన్ స్వచ్ఛతకు నిదర్శనమైన గాజు గ్లాసును కేటాయించడం హర్షనీయమని జనసేన సర్వేపల్లి నియోజకవర్గం సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్ జనసేన పార్టీని రాజకీయ పార్టీగా గుర్తించి గాజు గ్లాసును తమ పార్టీ గుర్తుగా కేటాయించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ముత్తుకూరు బస్టాండ్ సెంటర్ నందు బుధవారం ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ గాజు గ్లాస్ సింబల్‌ని నిన్నటి రోజు కేంద్ర ఎన్నికల సంఘం పొలిటికల్ పార్టీ జాబితాలో శాశ్వతమైన సింబల్ గాజు గ్లాసుని కేటాయిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. పోరాటం చేసి ఎన్నో అవమానాలను ఎదుర్కొని రాష్ట్ర ప్రజల కోసం రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యం అయి 21 ఎమ్మెల్యే సీట్లను 2 ఎంపీ సీట్లను గెలుచుకోవడం జరిగిందన్నారు.దేశ చరిత్రలో 100శాతం గెలుపొందిన పార్టీ జనసేన పార్టీగా చరిత్ర సృష్టించిన విషయం 2024లో మనం చూడడం జరిగిందన్నారు. నేడు సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో శాశ్వతమైన సింబల్ గాజు గ్లాసులో ఉచితంగా టీ తో పాటు పంపిణీ కార్యక్రమాన్ని చేస్తూ ప్రజలని జనసేన పార్టీలో భాగస్వామ్యం చేసుకుంటూ గ్రామపంచాయతీలలో అనేక సమస్యలను పరిష్కరిస్తూ నిస్వార్థంగా పార్టీ కోసం పనిచేస్తున్న జనసైనికులని, వీర మహిళలను, జనసేన నాయకులని గౌరవించుకుంటూ కదంతొకి అడుగు ముందుకు వేస్తున్న జనసేనఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు గుమ్మినేని వాణి భవాని నాయుడు, ముత్తు కూరు మండల సీనియర్ నాయకులు రహీం, అశోక్, శ్రీహరి, సుమన్,శ్రీను, పల్లాల శ్రీనివాసులు, ఆంజనేయులు, చిన్న, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పెరేడ్‌కి ప్రకాశం విద్యార్థులు

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియం లో జరగనున్న లోకల్ రిపబ్లిక్ డే క్యాంపు(పరేడ్) సెలెక్షన్‌లో భాగంగా గుంటూరు గ్రూప్ పరిధిలో నిర్వహించిన సెలక్షన్లో ఆంధ్ర లో ఉన్నటువంటి ఎన్.సి.సి గ్రూప్స్ అన్ని పాల్గొనగా మొత్తం 70 మంది ఎన్‌సిసి క్యాడెట్లు ఎంపిక అయ్యారు. అందులో మన గుంటూరు గ్రూపు అండర్ లో ఉన్నటువంటి 34 ఆంధ్ర బెటాలియన్ పరిధిలో ఉన్న 185 ఏ కాయ్ కందుకూరు ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజ్ నుంచి ఇద్దరూ ఎన్.సి.సి విద్యార్థినిలు సి.హెచ్.వెంకట శ్రావణి, పొల్లూరి గాయత్రి లు సీనియర్ వింగ్ క్యాడెట్లు ఎంపిక అయ్యారు వీరు గుంటూరు గ్రూపు నిర్వహించిన స్క్వాడ్రిల్ మరియు వెపన్ డ్రిల్ లో ఎంపిక అయ్యారు.ఎంపికైన ఎన్.సి.సి విద్యార్థినిలు ఈనెల 27-01-2025 వరకు విజయవాడలో జరగబోవు గణతంత్ర దినోత్సవం క్యాంపులో పాల్గొంటారు.అదేవిధంగా గణతంత్ర దినోత్సవం రోజున 26 జనవరి న సీఎం ముందు జరగబోయే పెరేడ్‌లో పాల్గొంటారు. ఈ క్యాంపుకు ప్రతి సంవత్సరం ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజ్ ఎన్‌సిసి విద్యార్థి, విద్యార్థినిలు లు ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య , టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కంచర్ల విజయ్ శ్రీనివాస్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఇలాంటి క్యాంపులకు ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజ్ మేనేజ్మెంట్ సహకారం ఎంతగానో ఉందని, ఎన్.సి.సి విద్యార్థులు ప్రతి సంవత్సరం సెలెక్ట్ కావడంతో ఎంతో ఆనందకరంగా ఉందని ఎన్‌సిసి నిర్వాహకులు, అకడమిక్ ఇన్ ఛార్జి ఎస్.ఎన్. మీరావలి అసోసియేట్ ఎన్.సి.సి ఆఫీసర్, ఇంటర్నేషనల్ మౌంట్ నీర్ లెఫ్టినెంట్ షేక్.హిమామ్‌షా మరియు సహాయక ఎన్‌సిసి ఇన్ చార్జి సంతోష్‌లు పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

విశాలాంధ్ర -దగదర్తి: నెల్లూరు జిల్లా..దగదర్తి మండలం తడకలూరు గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగల తగిలి ఇద్దరు గిరిజనులు మృతి చెందడం పై ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. /తడకలూరు గిరిజన కాలనీలో మృతి చెందిన మాణిక్యాల శ్రీనివాసులు పొట్లూరి బాలయ్య కుటుంబాలను ఎమ్మెల్యే దగుమాటి పరామర్శించారు. తక్షణ సాయం కింద రెండు కుటుంబాలకు కుటుంబానికి 50వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. తెలుగుదేశం పార్టీ తరపున బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, నెల్లూరు పార్లమెంట్ రైతు ప్రధాన కార్యదర్శి జలదంకి శ్రీహరి నాయుడు,మండల అధ్యక్షులు అల్లం హనుమంతరావు, ప్రధానకార్యదర్శి ఇట్రిన్ చేజర్ల పులి శీనయ్య, పాపన మల్లికార్జునరెడ్డి, బోలిగర్ల వెంకట రత్నం,బత్తల హజరత్తయ్య, బాలు బోయిన భాస్కర్‌బాలు, బోయిన వెంకటేశ్వర్లు, పెళ్లూరు శ్రీనివాసులు, ఆత్మకూరు బాబులు నాయుడు,అన్నం మల్లికార్జున,పొట్లూరు కిషోర్, మరు బోయిన గోపాల్,గోపసాని శ్రీనివాసులు,పేట హాజరత్తయ్య, యమ్ డి అప్సర్, పైడి శేషయ్య, పొంకం ప్రతాప్,కంద్రా వెంకటేశ్వర్లు,ముత్యాల గిరి,తాళ్లూరు కిషోర్,చల్లా శ్రీహరి,రాధాకృష్ణ రెడ్డి పాల్గొన్నారు..

నిబంధనలు పాటించి ప్రాణాలు కాపాడుకోండి: ఎమ్మెల్యే దగుమాటి

విశాలాంధ్ర -కావలి: కావలిలో 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలువిరవాణా శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న..ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.. ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ నుండి ఐకానిక్ సెల్ఫీ పాయింట్ వరకు జరిగిన భారీ ర్యాలీలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.సెల్ఫీ పాయింట్ వద్ద కరచాలను చేస్తూ విద్యార్థులతో సెల్ఫీలు దిగిన ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి..మార్పు మీ ఇంటి నుండి మొదలు పెట్టండి..భారతదేశ ఔన్నత్యాన్ని గుర్తించండి.. భారతీయులుగా గర్వించండి..ప్రతి ఒక్కరూ రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు నిబంధనలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలని నెల్లూరు జిల్లా..కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు.36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు లో భాగంగా కావలి రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ నుంచి విద్యార్థులతో కలిసి ఐ లవ్ కావలి ఐకాన్ సెంటర్ వరకు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జాతీయ జెండాకు కరచాలని చేసి విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మీ తల్లిదండ్రులు ద్విచక్ర వాహనం, కారులో ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా హెల్మెంట్ , సీట్ బెల్ట్ పెట్టుకునేలా చూడాలన్నారు. భవిష్యత్తు మీది, దేశం మీది, దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా మీదేనని విద్యార్థులకు తెలియజేశారు. మార్పు మీ ఇంటి నుంచి విద్యార్థులు మొదలు పెట్టాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరు కూడా కచ్చితంగా పాటించినప్పుడే ప్రాణాలు పోకుండా ఉంటాయని చెప్పారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సేవించి, సెల్ ఫోన్లో మాట్లాడుతూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి ప్రమాదం జరిగితే మీరే కాకుండా మీ ఎదుటివారు ప్రాణాలు కూడా తీసిన వారవతారన్నారు. అంతే కాకుండా మీ కుటుంబాలు రోడ్డున పడి మీ కుటుంబ సభ్యులు అనాథలుగా మిగులుతారని చెప్పారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో వంశీకృష్ణ,, ఆర్టీవో సుధాకర్ రెడ్డి, రూరల్ సీఐ రాజేశ్వరరావు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సుందరరావు, రెండో పట్టణ సీఐ గిరిబాబు, ఒకటో పట్టణ ఎస్సై సుమన్, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, టిడిపి పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబురావు,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పోతుగుంటి అలేఖ్య, టిడిపి నాయకులు తిరువీధి ప్రసాద్, జనిగర్ల మనోహర్, విష్ణు పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్న క్యాంటీన్ల ఆహారం అందించండి: కమిషనర్

విశాలాంధ్ర -నెల్లూరు టౌన్: నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసి ఉన్న శరణార్థుల శిబిరంలో ఉన్న నిరాశ్రయులకు అన్న క్యాంటీన్ల నుంచి ఆహారాన్ని, అందించాలని అలాగే భవనము యొక్క మరమ్మత్తు లను వెంటనే చెయ్యించాలని కమిషనర్ సూర్య తేజ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ బుధవారం స్థానిక పాత మున్సిపల్ ఆఫీస్ కార్యాలయంలోని శరణార్థుల శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శిబిరంలో ఉన్న వారందరికీ సబ్బు, నూనె, ఇతర క్రాస్మోటిక్స్, దుప్పట్లు, నూతన వస్త్రాలు అందించాలని సూచించారు. జాతీయ పట్టణ జీవనోపాధుల పథకం ఏ.ఆర్.డి.పి.డి. నిర్వహణలోని నిరాశ్రయుల ఆశ్రయ కేంద్రము, నెల్లూరు నగరపాలక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిరోజు 50 మంది నిరాశ్రయులకు అన్న క్యాంటీన్ల ద్వారా ఆహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక అన్న క్యాంటీన్ కమిషనర్ సందర్శించి ప్రజలకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించి నిర్వాహకులకు వివిధ సూచనలు జారీ చేశారు. అనంతరం సమీపంలోని వీధి శునకాల జనన నియంత్రణ కేంద్రాన్ని కమిషనర్ సందర్శించి వెటర్నరీ వైద్యునితో మాట్లాడారు. శస్త్ర చికిత్సలకు సంబంధించిన వివరాల నమోదు రిజిస్టర్ లను కమిషనర్ పరిశీలించి తగిన సూచనలు జారీ చేశారు. స్థానిక బాలాజీ నగర్ బాజీ తోట ప్రాంతంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు నేర్చుకుంటున్న కర్రసాము ప్రదర్శనను కమిషనర్ వీక్షించి విద్యార్థులను అభినందించారు. 15వ డివిజన్లోని 1,2,3 సచివాలయాలను కమిషనర్ సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయాలలోని వివిధ రికార్డులను తనిఖీ చేసి కార్యదర్శులకు వివిధ సూచనలు జారీ చేశారు. సచివాలయ పరిధిలో ఆస్తి పన్ను, తాగునీటి కుళాయి పన్ను, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లను వేగవంతం చేసి 100% లక్ష్యాలను పూర్తి చేయాలని కమిషనర్ వార్డు కార్యదర్శులను ఆదేశించారు. డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత, పారిశుద్ధ పనుల పర్యవేక్షణను క్రమం తప్పకుండా ప్రతిరోజు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ చెన్నుడు, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ. రామ్ మోహన్ రావు, ఈ.ఈ. రహంతు జాని, వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్మోహన్, రెవిన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా, ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్,ప్లానింగ్, అ ధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు,వార్డు సచివాలయ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

దళారుల దందా...

బర్త్ సర్టిఫికెట్ కోసం పదివేలు వసూలు...?

పొజిషన్ సర్టిఫికెట్ కు ఆరువేలు మరియు అధికారులకు కమీషన్

విశాలాంధ్ర -ఉలవపాడు : మండల కేంద్రమైన ఉలవపాడు లోని రెవెన్యూ కార్యాలయం దళారులకు కేంద్రంగా మారింది. దళారులు కను సైగల్లో రెవెన్యూ కార్యకలాపాలు జరుగుతున్నాయి అంటే అతిశయోక్తి లేదు. ఎవరైనా పేద బడుగు ప్రజలు రెవెన్యూ కార్యాలయం వైపు కన్నెత్తి చూడాలంటే మధ్యవర్తుల ధాటికి వెన్నులోవణుకు పుడుతుంది. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో విద్యార్థులకు అపార్ ఐడి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో పిల్లల బర్త్ సర్టిఫికెట్ల కొరకు రెవెన్యూ కార్యాలయం చేరిన వెంటనే ఈగల్లా వాలుకుపోయే మధ్యవర్తులు వారి నుంచి వేల రూపాయలు వసూలు చేస్తూ వీఆర్వోలకు అందించడం జరుగుతుంది. వీఆర్వోలు వారిని పది రోజులు అటు ఇటు తిప్పుకొని మీ పని రిజెక్ట్ అయింది మళ్లీమీరు అప్లై చేయాలంటే కొంత నగదు చెల్లించాల్సిందే అంటూ మధ్యవర్తుల్ని ముందు పెట్టి వారు డబ్బులు దండుకుంటున్నారు ఒక బర్త్‌సర్టిఫికెట్ కు సుమారు పదివేల రూపాయలు వసూలు చేస్తున్నారంటే ఆశ్చర్య పోవాల్సిన విషయం లేదు.ఒక వైపు పాఠశాల వాళ్ళు ఒత్తిడి చేయడం తో తల్లిదండ్రులు పిల్లల చదువుల కు ఆటంకం లేకుండా చూడాలని తపన తో డబ్బులకు డబ్బులు నష్టపోవడం తో పాటు సమయం కూడా వృథా చేసుకుంటున్నారు.వీఆర్ఓ లు అలా దోచుకుంటుంటే సచివాలయ సర్వేయర్ లు పొజిషన్ సర్టిఫికెట్ కోసం వారికి ముడువేలు తమ సచివాలయ వి ఆర్ ఓ కి మూడు వేలు పై అధికారులకు కొంత అంటూ విచ్చలవిడిగా దోచుకుంటున్నారు.ఎవరైనా అంత ఇవ్వలేము అని అడిగితే మీ పని అవ్వదు ఎలా జరిగిద్దో చూస్తాం అంటూ బెదిరింపులు కు దిగుతున్నారు. ఎలాంటి ఘటనలు, చాకిచర్ల, ఆత్మకూరు, భీమవరం, బద్దిపూడి, వీరేపల్లి, మన్నేటికోట,సచివాలయాల పరిధిలో ఎక్కువగా జరుగుతున్నాయి.ఎలాంటి విషయాల పై ఒకరిద్దరు అవినీతి నిరోధక శాఖ ను కూడా సంప్రదించినట్లు సమాచారం.కావున ఇప్పటికైనా జిల్లా రెవిన్యూ అధికారులు స్పందించి ఉలవపాడు రెవిన్యూ కార్యాలయంలో దళారుల దందాకు అడ్డుకట్ట వేసి లంచాలు కు అలవాటు పడ్డ అధికారులు ను గాడి లో పెట్టక పోతే ప్రజాగ్రహం తో అధికారులు సైతం ఇబ్బందులు ఎదుర్కోవలిసి వస్తుందని పలువురు వాపోతున్నారు.